కొయ్యకాళ్లను కాల్చడంతో భూమిలోని పోషకాలు నశిస్తాయి



ఎదులాబాద్‌లో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి బాసిత్

ఘట్‌కేసర్: పొలంలోని కొయ్యకాళ్లను కాల్చడం ద్వారా భూమిలోని పోషకాలు నశించి మొత్తం బూడిద ఏర్పడుతుందని, ఇది పంటలకు పనికి రాని పదార్థంగా నిలుస్తుందని మండల వ్యవసాయ అధికారి బాసిత్ అన్నారు. ఎదులాబాద్ రైతు వేదికలో అన్నదాతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొయ్యకాళ్లను కాల్చడం ద్వారా భూమికి, వాతావరణానికి జరుగుతున్న నష్టం గురించి వివరించారు. నత్రజని, భాస్వరం, పొటాషియం, సేంద్రీయ పదార్థాలు, పంటలకు ఉపయోగపడే వానపాములు, ఇతర మిత్ర పురుగులకు హాని జరుగుతుందన్నారు. అన్నదాతలెవ్వరు కొయ్యకాళ్లు కాల్చకుండా మట్టిలోనే కలిసే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ అధికారి జగదీష్, అన్నదాతలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు

పోచారం: వెంకటాపూర్‌లోని నాడెం చెరువు సమీపంలో వెలసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఇందులో భాగంగా బుధవారం టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి కంప్రెషర్‌లతో తూతూమంత్రంగా కూల్చివేశారు. ఇదే నిర్మాణాలపై మరోమారు కూల్చివేత చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



జవహర్‌నగర్: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన మహ్మద్ రిజ్వాన బేగంకి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును ఆయన అందచేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినయ్‌కుమార్, నాయకులు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి, గణపతి శివలింగం, సుబ్రహ్మణ్యస్వామి, నంది విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు కస్నూరి రమేష్, సునిత దంపతులు, అంబర్‌పేట్ వరదరాజు ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో శంకరప్ప, శివకుమార్, ఆలయ పూజారి శ్యామ్ కుమార్, గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సెక్టార్ క్రాస్ కంట్రీ రేస్ పోటీలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో వార్షిక క్రీడా కార్యక్రమంలో భాగంగా ఇంటర్ సెక్టార్ క్రాస్ కంట్రీ రేస్- 2024 పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌పీఎఫ్ డీఐజీపీ అనిల్‌మింజ్ హాజరయ్యారు. ఈ పోటీలకు దేశంలోని సీఆర్‌పీఎఫ్ 23 సెక్టార్ జట్లు పాల్గొనగా రేసులో మొదటి స్థానంలో మధ్యప్రదేశ్ సెక్టార్ మోహన్‌సింగ్, ద్వితీయ స్థానంలో శ్రీనగర్ సెక్టార్ హరేకృష్ణ, తృతీయ స్థానంలో శ్రీనగర్ సెక్టార్ దినేష్ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ ఢీకొని లారీ డ్రైవర్ మృతి



యాదయ్య(ఫైల్)

ఘట్‌కేసర్: ద్విచక్రవాహనదారుడు అతివేగంగా ఢీకొట్టగా లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్‌లో నివసించే లారీ డ్రైవర్ యాదయ్య (55) లారీలో ఇసుక నింపుకొని భువనగిరి నుంచి ఘట్‌కేసర్ వైపు వస్తుండగా బుధవారం వేకువజామున అవుషాపూర్ కేసీఆర్ పార్కు వద్దకు రాగానే లారీ టైర్ పగిలిపోయింది. ఈ నేపథ్యంలో లారీని రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్ యాదయ్య టైర్‌ను పరిశీలిస్తుండగా.. జైనపల్లికి చెందిన శివరామకృష్ణ (33) బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో శివరామకృష్ణకు తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కీసర: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం సాయంత్రం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి చౌరస్తాలో నివసించే ఎలేందర్(35) బుధవారం సాయంత్రం తన స్కూటీపై కీసరకు వస్తుండగా.. ఓఆర్‌ఆర్ జంక్షన్ సమీపంలో వెనకాల నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో ఎలేందర్ రోడ్డు పై పడిపోయాడు. ఈ ఘటనలో డ్రైవర్ లారీని ఆపకుండా అలాగే వెనకకు తీశాడు. దీంతో లారీ చక్రాలు ఎలేందర్ కాళ్లపై నుంచి వెళ్లగా అతని రెండు కాళ్లు నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఎలేందర్‌ను ఈసీఐఎల్ చౌరస్తాలోని తులసి ఆసుపత్రికి తరలించగా.. అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫార్మా ఉత్పత్తుల్లో భారత్‌దే అగ్రస్థానం

కీసర: భారతదేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉందని సీరో ఫార్మా ప్రైవేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాగారం మున్సిపల్ రాంపల్లిలో గల కేజీఆర్ కళాశాలలో కళాశాల చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి అధ్యక్షతన ఫార్మసీ విద్యార్థులకు నిర్వహించిన అవగహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఫార్మసీ చదువుకుంటున్న విద్యార్థులకు ఉద్యోగ పరిశోధన రంగాల్లో అపరిమిత అవకాశాలున్నాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. క్రమ శిక్షణ, శ్రమను కలిపితే అద్భుతాలను సాధించవచ్చన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాలలో అద్భుతమైన సౌకర్యాలు, ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన



ఉపాధ్యాయులతో విద్యాబోధన చేపట్టడం జరుగుతుందన్నారు. తమ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఫార్మసీ పరిశ్రమలో నూరు శాతం ఉద్యోగ కల్పనకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రమణారావు, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయకుమార్, హరిప్రసాద్, శిల్పిక, నాగరాజు, సింధూజ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు అధికం



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



కళాశాల ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న ఫార్మసీ కాలేజ్ వైస్‌చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి

పోచారం: ప్రపంచవ్యాప్తంగా ఫార్మసీ రంగానికి అధిక ప్రాధాన్యత ఉందని నల్ల నర్సింహారెడ్డి ఫార్మసీ కాలేజీ వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి కళాశాలలో బీఫార్మసీ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మసీ రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు పట్టుదల, క్రమ శిక్షణతో చదవాలని, భావితరాల అవసరాలను గుర్తించి పరిశోధనలు చేయాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రత్యేక సంచికను ఆయన విడుదల చేశారు. తొలుత విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కృష్ణారెడ్డి, డీన్ డా.కృష్ణ మోహన్, ఇంజినీరింగ్ విభాగం డీన్ డా. జనార్ధన్‌రాజు, ఎంబీఏ విభాగం డీన్ డా. రవీంద్రారెడ్డి, టీపీఓ శ్రీకాంత్, హెచ్ఓడీలు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

కీసర స్వామి సేవలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి



కీసర: కీసర గుట్ట శ్రీరామలింగేశ్వరుడి సేవలో బుధవారం సాయంత్రం మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి పాల్గొన్నారు. కీసరగుట్ట దేవాలయానికి విచ్చేసిన మాజీ డీజీపీ దినేష్‌రెడ్డికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలో కొలువైన శ్రీ స్వామివారి అభిషేక పూజ అనంతరం డీజీపీకి కీసరగుట్ట అర్చకులు స్వామివారి ఆశీర్వచనంతో పాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. అనంతరం కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించిన సాముహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి పాల్గొని కార్తీకదీపాలను వెలిగించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సాముహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో మాజీ డీజీపీ దినేష్‌రెడ్డి

ఘనంగా ప్రపంచబాలల దినోత్సవ వేడుకలు



కీసర: రాంపల్లి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజరావు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థులందరూ బాగా చదివి ప్రయోజకులవ్వాలన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రత్యేకంగా నిర్వహించిన అసెంబ్లీ, వారు ఆలపించిన గానం, ప్రదర్శించిన నృత్యం, ఇత్యాది సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.



నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

అల్వాల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వికలాంగుల సంక్షేమాధికారి ఆధ్వర్యంలో ఆర్కేపురంలోని అంబేడ్కర్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో గురువారం జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ ఆర్గనైజర్ ఉమ్మర్‌ఖాన్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వివిధ ప్రత్యేక పాఠశాలలో చదివే విద్యార్థులు గురువారం ఉదయం ఉదయం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలు - 8978713923లో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మదర్సా ఉర్సు



మేడ్చల్: పట్టణంలోని హజరత్ జిందా షా మదర్సా ఉర్సు ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా దర్గా సందల్, పూల దట్టీ, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాకు సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కుల మతాలకు అతీతంగా మేడ్చల్ పట్టణంలోని ప్రజలు పెద్దఎత్తున పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో దర్గా మసీదు కమిటీ అధ్యక్షుడు జమాల్ ఖురేషి, ప్రధాన కార్యదర్శి ఇనాయత్ అలీ, మసీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ లాయక్ అలీ, ఎండీ అబేద్, ఎండీ ఖాలేద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: డివిజన్ పరిధిలో దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ తెలిపారు. బుధవారం 28వ డివిజన్ పరిధిలో రూ 20లక్షలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ భవనం, సుభాష్‌నగర్ కాలనీలో రూ. 20లక్షలతో సీసీ రోడ్డు పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగర ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్ సమస్యలపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి, 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ్మా, కాంగ్రెస్ పార్టీ నాయకులు దానగల్ల యాదగిరి, రాపోలు ఉపేందర్ పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

బోడుప్పల్: చిన్నతనం నుంచి విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు, ఇంటర్నెట్ మాధ్యమానికి దూరంగా ఉంటానని, తోటి విద్యార్థుల పట్ల స్నేహంగా ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు సత్ప్రవర్తనతో, సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి

బోడుప్పల్: చెంగిచర్లలోని సర్వే నంబరు 59లో నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ బుధవారం హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వే నంబర్ 59లో గతంలో లే అవుట్ చేసి ప్లాట్‌లు విక్రయించారన్నారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి హెచ్ఎండీఏ, బోడుప్పల్ నగర పాలక సంస్థ అధికారులను తప్పుదారి పట్టించి చెరువు శిఖం భూమిలో గృహ నిర్మాణాలకు అనుమతులు తీసుకుని అపార్ట్‌మెంట్లు నిర్మిస్తున్నారన్నారు. 59 సర్వేనంబర్‌లోని 4.12 ఎకరాలకు, సర్వేనంబరు 57 చింతల చెరువు శిఖం భూమిలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ప్రారంభం

మల్లాపూర్: నేర పరిశోధనలో నిఘా నేత్రాలు కీలకమని నాచారం ఎస్ఐ మైబెల్లి అన్నారు. బుధవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగ చెరువు తండా అధ్యక్షుడు పీరునాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కుంటి కృష్ణ, సింగచెరువు తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పూడూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని చెట్ల కొమ్మల నరికేవేత కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. పూడూర్, మునీరాబాద్ గ్రామాలలో అన్ని పరిశ్రమలకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

పోచారంలో..

విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మల తొలగింపు చర్యలు చేపట్టినందున గురువారం కొన్ని ప్రాంతాలకు కరెంట్ ఉండదని ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అన్నానగర్, పోచారం గ్రామం, శివాలయం పరిసరాలు, డాక్టర్స్ కాలనీ, సేరీన్ హిల్స్, సూర్య కన్‌స్ట్రక్షన్స్, ఇన్ఫోసిస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జవహర్‌నగర్‌లో..

విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ బాలాజీనగర్ సబ్‌స్టేషన్, 11కేవీ లక్ష్మీనర్సింహ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు చెన్నాపురం, లక్ష్మీనగర్, నెహ్రూనగర్, శివనగర్, జయశంకర్‌కాలనీ, లెప్రసీ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, సిటీజన్స్ కాలనీ, శాంతినగర్, త్రీ టెంపుల్, చిలకల బిల్డింగ్, రేణుక ఎల్లమ్మ ఆలయం, ఆదర్శ్ నగర్, వికలాంగుల కాలనీ, జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని సాంబశివరావు తెలిపారు.

శామీర్‌పేట్‌లో..

శామీర్‌పేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ఎన్‌టీఆర్‌ఓ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నల్సార్ యూనివర్సిటీ, బీజీఎల్, ఎన్‌టీఆర్‌ఓ, ఎంపీడీఓ ఆఫీస్ ప్రాంతాలు, సెలబ్రిటీ రిసార్ట్, పెద్దమ్మ కాలనీ, శామీర్‌పేట్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలన్నారు. సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న అరాచకాల నిర్మూలనకు కృషి చేయాలని, కళాశాలలో ర్యాగింగ్‌పై పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తుకు బానిసై డ్రగ్స్ బారిన పడుతున్నారన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలని, యువతకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల డీన్ వెంకటరమణయ్య, డైరెక్టర్ అలీబేగ్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలకు నిలయం రామ్‌రాజ్ కాటన్



రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న దిల్‌రాజు, కేఆర్.నాగరాజన్



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

గౌతంనగర్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు రామ్‌రాజ్ కాటన్ ప్రత్యేక నిలయంగా మారుతుందని సినీ నిర్మాత దిల్ రాజు అన్నారు. బుధవారం ఆయన గౌతంనగర్ డివిజన్, భవానీనగర్‌లో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూమ్‌ను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, రత్నాలయం దేవస్థానం వైస్ చైర్మన్ రామవెంకటేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ.. భారతదేశ అత్యంత విశ్వసనీయ, ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో రామ్ రాజ్‌కు స్థానం దక్కిందన్నారు. అమ్మకాల్లోనూ రామ్‌రాజ్ కాటన్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. అనంతరం రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్.నాగరాజన్ మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో 300వ షోరూమ్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయం, సంస్కృతిని కాపాడాలనే తపనతో ఈ సంస్థను ప్రారంభించామన్నారు. బాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడానికి రామ్‌రాజ్ కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ప్రారంభించిందని, యువతను ఆకట్టుకునే వివిధ రంగుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా www.ramrajcotton.in లో ఆన్‌లైన్ విక్రయాలను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, షోరూమ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ ఫోన్ల విక్రయాలను అరికట్టాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: కొందరు దుండగులు చోరీ చేసిన ఫోన్లను దుకాణదారులకు విక్రయిస్తున్నారని, అలాంటి వ్యాపారాన్ని అరికట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం జరిగిన మొబైల్ షాపు అసోసియేషన్ సమావేశానికి వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఇన్‌స్పెక్టర పరశురాం, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యజమానులు దుకాణాల ట్రేడ్ లైసెన్స్‌ను తీసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం మాట్లాడుతూ.. ఎవరైన దొంగిలించబడిన ఫోన్లు విక్రయించడానికి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేని పక్షంలో విక్రయదారుడి ఆధార్ వివరాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్, ఆంజనేయులుగౌడ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సిరాజ్, విజయ్‌గౌడ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పేదలకు సహాయం చేయాలి



సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్, మేయర్ శాంతి తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని శారదా ఎడ్యుకేషన్ సొసైటీ విద్యార్థులకు ఫీడింగ్ ఇండియా వారి సహకారంతో సుస్థిర అభివృద్ధికై విద్యార్థి పౌష్టికత అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా పేదలకు సహాయం చేయాలని కోరారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే శారీరకంగా ఎదుగుదలకు దోహదపడుతుందన్నారు. ఫీడింగ్ ఇండియా వారి సహకారంతో జోమాటో సమిష్టి కృషితో విద్యార్థులు ఆహారం అందిస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కార్పొరేటర్లు లావణ్యసతీష్‌గౌడ్, నవీన్‌కుమార్, బీజేపీ నాయకులు మహేందర్‌యాదవ్, ఫీడింగ్ ఇండియా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.